టికెట్ తీసుకుని ప్లాట్‌ఫాం మీదికి అడుగుపెట్టింది శ్రావ్యగీత. ఉబ్బిన ఆమె కళ్ళల్లోంచి కన్నీరింకా ఉబుకుతోంది. కొంగుతో తుడుచుకుంటూ సూట్‌కేస్ పక్కన పెట్టి సిమెంట్ బెంచీ మీద కూలబడింది. గుండెలోని బాధ కంటిని తడుపుతుంటే అసలెందుకిలా జరిగిందని మది ఆక్రోశిస్తోంది.

తనంటే అంత అభిమానం చూపించే భర్త ఈ చిన్న విషయం మీద ఇంత కాఠిన్యత చూపి స్తాడనుకోలేదు.

తను చేసింది తప్పే. సరైన అవగాహన లేకుండా చేసింది. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని తండ్రి వద్దకు వెళుతుంది?

మూన్నాళ్ళ కాపురం?

తన తండ్రి స్థితి!

ఇద్దరక్కల పెళ్ళిళ్ళు అయ్యేసరికి తండ్రి గుమాస్తా ఉద్యోగం "దగ్గిరపడింది". ఆపై ఎదిగిన తను... తన వెనుక ఆలస్యంగా ఓ తమ్ముడు... రోగిష్టి అమ్మ... ఇదీ ఇంటి స్థితి.

నాన్న రిటైరయ్యాక పరిస్థితి మరీ దారుణ మయ్యింది. అమ్మ మందులకోసం నాన్న పడుతోన్న యాతన. మధ్య మధ్యలో అల్లుళ్ళ 'అగడాలు'... కూతుళ్ళ కడుపు'పంట'ల భారాలు...

పీట మీద కూర్చోడానికి ప్రతి పూటా తడుముకో వాల్సిన స్థితి.

సరైన పుస్తకాలు... బట్టల్లేని తమ్ముణ్ణి చూస్తుంటే గుండెల్లో బాధ.

ఎటు చూసినా దారిద్ర్యం... అప్పులు.

ఆ పరిస్థితుల్లో కూడా తన పెళ్ళికి ప్రయత్నాలు చేస్తోన్న నాన్నను చూస్తుంటే తన పుట్టుకనే తిట్టుకో వలసిన స్థితి. అసహ్యించుకోవల్సిన పరిస్థితి!

నాన్న అదృష్టమో... ఏ దేవుడు కరుణించాడోగానీ తన్ను చూసి ఇష్టపడి ఏదో నామమాత్రం కట్నానికే పెళ్ళి చేసుకున్నాడు మోహన్. ఆ ఇంటిని వదలి వెళుతుంటే కన్నీరు వరదే అయింది.

కాపురం... కొత్త కాపురం. అప్పటి వరకూ బతికిన బతుకు మారిపోయింది. మోహన్‌కు వచ్చే జీతంతో ఇద్దరూ హాయిగా గడిపారు. తనంటే మోహన్‌కు ఎంతో ఇష్టం. నెల కాగానే జీతం తెచ్చి చేతుల్లో పోసేవాడు. ఏ బాదరబందీ లేదు... దేనికీ లోటు లేదు.

బతుకులోని తీయదనం అనుభవంలోకొస్తుంటే ఈ ఆనంద మాధుర్యాల మధ్య అమ్మానాన్న... తమ్ముడి ముఖాలు గుర్తొచ్చి గుండెలో దాగిన బాధను కెలికినట్ట య్యేది.

ఈ మధ్య మరీ అనుక్షణం అమ్మానాన్నల గురించిన ఆలోచనే మనస్సును పీకుతోంది. తనే కొడుకై నాన్నకు సహాయంగా వుంటే ఎంత బాగుండేది అనిపిస్తుంది.

తన దగ్గర మిగిలిన డబ్బులు ఓ నాలుగు వందల వరకూ వున్నాయి. ఈ మూణ్ణెల్లలో ఇంత వరకూ మోహన్ ఏనాడూ తనను లెక్కలడగలేదు. ఈ డబ్బు నాన్నకు పంపిస్తే? ఏదో కొద్దిగా సహాయంగా వుంటుంది కదా...!

ఈ సంగతి మోహన్‌కు చెప్పాలా వద్దా అని ఆలోచిస్తూ... చివరకు చెప్పకుండా పంపింది తను.

అదే తను చేసిన తప్పు.

ఆ తప్పు ఇప్పుడిలా పుట్టింటి సయనానికి దారి తీస్తుందని కలలో కూడా అనుకోలేదు తను.

వారం రోజులు గడచిపోయాయి.

ఉదయం వంటింట్లో వున్న తనను ఒక్కసారిగా మోహన్ పిలిచాడు. మోహన్ చేతిలో మనీ ఆర్డరు కట్టిన రశీదు. తను ఎక్కడో పొరపాటున పెట్టేసింది. అదిప్పుడు... దొరికింది.

ఎంత సమాధానపరచినా మోహన్ ఊరుకోలేదు. ఇన్నినాళ్ళ ప్రేమ ఏమయిపోయిందో విచిత్రమయి




పోయింది. తన తప్పుని ఒప్పుకుంది. క్షమించమని ప్రాధేయపడింది.

ఊహూ... వింటేగా...!

ఒక మాటే పట్టుక్కూర్చున్నారు.

"ఆ డబ్బు దొంగతనంగా పుట్టింటికి పంపావు. నాకు తెలియకుండా... ముందు ముందు ఇంకా ఎన్ని పంపిస్తావో... సాయంత్రం ట్రైనుంది. వెళ్ళి మీ నాన్నను రమ్మను..."

ఎంత నిర్దయులైపోయారు. అంతా ఓ కలలాగ వుంది. ఇన్నినాళ్ళ కాపురం ఏమయిపోయింది? మగ వాళ్ళు ఎంతలో మారిపోతారు!

"సాయంత్రం నేనింటికొచ్చేసరికి నువ్వుండ కూడదు. ఈ ఇంట్లో ఏ వస్తువు పోయినా..." హెచ్చరిక!

భీకరంగా అరచిన ట్రైన్ కూతతో ఈ లోకంలో కొచ్చింది శ్రావ్యగీత. వేదనా భారంతో ట్రైయినెక్కి కిటికీ ప్రక్కగా కూర్చుంది.

మోహన్... ఎంత మారిపోయావు! ఆ చిన్న తప్పుకు ఇంతటి శిక్షా?

స్టేషన్‌లో జనం హడావుడిగా వున్నారు. ఇప్పుడు హఠాత్తుగా మోహన్ వచ్చి "రా శ్రావ్యా... జరిగిందేదో జరిగిపోయింది" అంటే...

నవ్వుకుంది. అంత అదృష్టమా!

గార్డు విజిల్ వినపడుతోంది. బరువైన రెప్పలను తుడుచుకుంటూ చూసింది...

మోహన్... వెతుక్కుంటూ వస్తున్నారు.

"ఏమండీ..." ఆనందం వెల్లువే అయింది.

"రా శ్రావ్యా దిగు... బండి కదులుతోంది..."

ఒక్కుదుటున సూట్‌కేస్ అందించి మోహన్ చేయి అందుకుంది. స్టేషన్‌లో అందరూ చూస్తున్నా ఆ చేయిని వదలాలనిపించలేదు.

బయట ఆటో ఎక్కాక "ఏమండీ... క్షమించండి" అంటోన్న శ్రావ్యగీత కేసి చూస్తూ "స్టాప్... స్టాప్" అని నవ్వుతూ ఓ లెటర్ ఆమెకిచ్చాడు.

అది శ్రావ్యగీత తండ్రి రాశాడు. మధ్యాహ్నం పోస్ట్‌లో వచ్చింది.

అల్లుడుగారికి-

ఆశీర్వదించి వ్రాయునది. అక్కడ మీరు, అమ్మాయి క్షేమమని ఆశిస్తాను. రెండు రోజుల క్రితం అమ్మాయి నాలుగు వందలు ఎమ్.ఓ. చేసింది. అది మీకు తెలియకుండా పంపుతున్నట్టు రాసింది. అది చిన్నపిల్ల. సరియైన అవగాహన లేనిది. దానిని క్షమిస్తారని ఆశిస్తూ, ఆ డబ్బు మీకు పంపిస్తున్నాను..."

"మీ తమ్ముణ్ణి కొన్నాళ్ళు మన దగ్గర వుంచుకుని చదివిద్దాం!"

మోహన్ మాటలకు "నిజం?" అంటూ చూసింది.

"నిజమే" అంటున్న మోహన్‌ని అల్లుకుపోతుంటే ఆమె మనసు శ్రావ్యగీతమే అయింది.

— జి.ఎస్.వి. సత్యనారాయణ

న్యూజెర్సీ కథల పోటీలో
సాధారణ ప్రచురణకు ఎంపిక చేసినది